# ఇలాగ ఎందరో?

-కట్టా రాంబాబు

బస్సెక్కిన వెంటనే కండక్టరు ప్రక్కన కూర్చున్నాడా యువకుడు. అతనికి పాతికేళ్ళుంటాయి. కొద్దిగా నలిగిన బట్టలు, వాడిన ముఖంతో ఉన్నాడు.

అతని దగ్గరనుంచి గుప్పుమని బ్రాందీ వాసన రావడంతో కండక్టరు ''సార్! వెనక్కి పోయి కూర్చోకూడదూ. బస్సంతా ఖాళీగానే వుందిగా!'' అన్నాడు.

అతను మరేం మాట్లాడకుండా అక్కడనుంచి కదిలి వేరే సీట్లో కూర్చున్నాడు. ఆ సీటు వెనుక సీటులో దంపతులు కూర్చున్నారు. అతని దగ్గరనుంచి వస్తున్న వాసనకు ఆమెకు కడుపులో తిప్పినట్లయింది.

''అబ్బ...భరించలేకపోతున్నామండీ. మనం సీటయినా మారిపోదాం లేదా అతన్ని వేరే సీట్లోనయినా కూర్చోమనండి'' అంది భర్తతో.

ఆమె మాటలు అతనికి చురుక్కుమనిపించాయి. వెంటనే అక్కడనుంచి లేచి వేరే సీటులోకి మారాడు. అతను కూర్చున్న వెంటనే అంతవరకూ అక్కడ కూర్చున్న వ్యక్తి లేచి ఇంకో సీటులో కూర్చున్నాడు.

అతనికి తల కొట్టేసినట్టయింది.

''ఏమిటి! ఇలా జరుగుతోంది. తను ఇదే మొదటిసారి తాగడం. మామూలుగా ఎప్పుడు ప్రయాణం చేసినా ఇలా జరగలేదు. అంటే తాగి బయట తిరిగితే ఇలాగే జరుగుతుందా? తాగే వాళ్ళని ఎవరూ గౌరవించరా? ముఖం చిట్లించే వాళ్ళూ, తిట్టుకునేవాళ్లు తప్పితే ఎవరూ హర్షించే వాళ్ళు కన్పించరేం! తాగేవాళ్ళకి గౌరవముండదా?

అతను యూనివర్శిటీలో పిజి చేస్తున్నాడు. ఫ్రెండ్స్ బలవంతం చేయడంతో తాగాడు. ఇంటికి పోదామని బస్సెక్కితే జరిగిందది.

అతను మదనపడడాన్ని చూసిన ఓ పెద్దాయన—

''ఇలారా బాబూ! ఇక్కడ కూర్చో'' అని పిలిచాడు.

ఆయనకు యాభై ఏళ్ళు పైనే వుంటాయి. పంచె, లాల్చీ వేసుకున్నాడు. వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాడు.

బస్సు బయలుదేరింది.

''ఏమిటీ! ఎవరూ నీ ప్రక్కన కూర్చోవడంలేదా?'' నెమ్మదిగా అడిగాడాయన.

అతనేం మాట్లాడలేదు.

''బాగా తాగినట్లున్నావు. రోజూ ఇలాగే తాగుతావా?''

''లేదండీ. ఇదే మొదటిసారి'' కొంచెం ముద్దగా వస్తున్నాయి మాటలు.

''ఎందుకు తాగావు?'' సౌమ్యంగా అడిగాడాయన.

''నా ఫ్రెండ్స్‌లో అందరూ తాగేవాళ్ళే. నేనొక్కడ్నే తాగనివాడ్ని. వాళ్ళంతా రోజూ నన్ను ఆట పట్టించడం, నన్ను చాలా చిన్నచూపు చూడడంతో వాళ్లమీద కసి, కోపంతో తాగేసాను.''

''చూసావా! వాళ్లలో ఒకడిగా మారడానికే తాగావుగానీ నువ్వు నీలా ఉండాలని మాత్రం అనుకోలేదు. తాగితే రెస్పాన్స్ ఎలా వుంటుందో గమనించావుగా. చూడు నాయనా! ఇప్పుడు తాగడం ఒక ఫ్యాషనైపోయింది. తామేదో కల్చర్ గలవాళ్లమని, తాగనివాళ్ళంతా కల్చర్‌లెస్ ఫెలోస్ అని తాగేవాళ్ళంతా అనుకుంటారు. కల్చర్‌కి నిర్వచనం ఇలాంటి వ్యసనాలేనని వాళ్ళ అభిప్రాయం కావచ్చు. కానీ తాగేవాళ్ళని సమాజం ఎంత అసహ్యించుకుంటుందో వాళ్ళు గమనించరు. అసలు తాగుడువల్ల ఎన్ని కుటుంబాలు నాశనమైపోతున్నాయో కదా. అది గమనించకుండా అందరూ తాగుడు అలవాటు చేసుకుంటున్నారు.''

''అవునండీ. మా యూనివర్శిటీలో కూడా ఎక్కువశాతంమంది స్టూడెంట్స్ తాగేవాళ్ళే.''

''స్టూడెంట్స్ అన్న మాటేమిటి నాయనా, వాళ్ళకి పాఠాలు చెప్పే లెక్చరర్లే తాగుతున్నారు. విద్యా వ్యాప్తే మా ధ్యేయం అని కాలేజీలను స్థాపించే యాజమాన్యం వాళ్ళు తాగుతున్నారు. ఇంకో తమాషా



అయిన విషయం చెప్పమంటావా? మా ఊళ్ళో కొంత మంది లెక్చరర్లు కలసి బ్రాందీ షాపు పెట్టారు. వాళ్ళు కాలేజీలో పాఠాలుచెప్పే దానికంటే బ్రాందీ అమ్మకాల మీదే ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తారు.''

''నిజమా!'' అన్నాడా యువకుడు ఆశ్చర్యంగా.

''ఆశ్చర్యంగా వుంటుంది. నమ్మశక్యం కూడా కాదు. కానీ ఇది వాస్తవం. ఆచార్య దేవో భవ అనిపించుకునే లెక్చరర్లు ఈ రోజున ఆ స్థితిలో వున్నారంటే వాళ్ళ మాటల్ని ఏ విద్యార్థి వింటాడు చెప్పు. ఒకవేళ చెప్పినా వాళ్ళ ముఖం మీద ఉమ్మేస్తారు. అసలు విద్యావ్యవస్థ ఇలా తగలడ్డానికి, యువత చెడిపోవడానికి తాగుబోతులైన కొంతమంది ఉపాధ్యాయులే కారణం కదూ?'' అన్నాడాయన ఆవేశంగా.

''మీకు తాగేవాళ్ళంటే చాలా కోపంగా వున్నట్టుంది.''

''కోపం కాదు నాయనా! బాధ. ఇక్కడ నా గురించి కొంత చెప్పాలి. నేనో బడిపంతుల్ని. నలుగురు పిల్లలు. అతి కష్టంమ్మీద సంసారాన్ని లాక్కొస్తున్నాను. పెద్దకొడుకు చేతికందొస్తాడనుకున్నాను. కానీ లెక్చరర్లకి కావాల్సిన బాటిల్స్ అందించి, అందించి వాడూ తాగుడు నేర్చుకున్నాడు. డిగ్రీ పూర్తయ్యాక ఏదో చిన్నపాటి ఉద్యోగం దొరికింది. వాడి జీతమంతా తాగుడికే సరిపోయేది. పెళ్లి చేస్తేనైనా వాడిలో మార్పు వస్తుందనుకున్నాను. పెళ్లాన్ని ఏడిపించుకు తిన్నాడు. వాడి బాధలు పడలేక ఆ పిల్ల ఆత్మహత్య చేసుకుంది. ఓ రోజు బాగా తాగి రోడ్డుమీద నడుస్తుంటే లారీ గుద్దేయడంతో అక్కడికక్కడే చచ్చిపోయాడు. అందుకే తాగేవాళ్లని చూస్తే ఒకప్రక్క కోపం, మరోపక్క బాధ కలుగుతాయి నాకు.''

''సారీ అండీ. అనవసరంగా మీకు గతాన్ని గుర్తుచేసాను.''

''నువ్విప్పుడు తాగుడు మొదలుపెట్టావు. ముందు ముందు తాగకపోతే వుండలేని పరిస్థితికొస్తావు. నీ తల్లిదండ్రులు ఎంత బాధపడతారో కదా! రేపు నీకు పెళ్ళయితే ఎన్నో కలలు కంటూ నీ జీవితంలోకి ప్రవేశించే భార్య నిన్నెంత అసహ్యించుకుంటుందో ఆలోచించు. నీకు పిల్లలు పుడితే వాళ్ళు ఒక తాగుబోతు పిల్లలుగా ముద్రపడితే వాళ్ళ భవిష్యత్తేమిటో కూడా ఆలోచించు. తాగుబోతు పెళ్లాంగా, పిల్లలుగా వాళ్ళు పొందే గౌరవం ఎలా వుంటుందో ఒక్కసారి ఊహించు.

అంతెందుకు...నీకు ఉద్యోగం దొరికి తాగుడువల్ల జీతం సరిపోక లంచాలకు అలవాటుపడి దొరికిపోయి ఉద్యోగం పోగొట్టుకుంటే నువ్వెలా బతగ్గలవో చెప్పు. చాలామంది కష్టాల్ని మరచిపోవడానికి తాగుతున్నామంటారు. కానీ అసలు కష్టాలన్నీ తాగుడువల్లే వస్తాయని గ్రహించరు. ఒకవేళ నాలాంటివాళ్ళు అది మంచిది కాదని చెప్పినా ఎవరూ వినరు సరికదా, నన్ను తెలివితక్కువ వాడికిందో, లేక తాగడం చేతకానివాడికిందో జమ కడతారు. నువ్వు ఇప్పుడిప్పుడే తాగడం మొదలుపెట్టావు. దాన్ని మానడం పెద్ద కష్టంకాదు. ఏమంటావు?' అడిగాడాయన.

అతనేం మాట్లాడలేదు. ఏదో ఆలోచనల్లో పడ్డట్టు మాత్రం కన్పించాడు. ఇంతలో ఆ యువకుడు దిగవలసిన స్టేజీ రావడంతో ఆయనకు ''వస్తానండీ'' అని చెప్పి దిగిపోయాడు. బస్సు కదిలే ముందు కిటికీలోంచి బయటకు చూసిన ఆయనకు ఆ యువకుడు తన జేబులో వున్న బ్రాందీ బాటిలుతీసి రోడ్డుకేసి కొట్టడం, అది ముక్కలయిపోవడం కనిపించింది.

★